క్రీడా పరికరాలు కరువు

- కొన్నేళ్లుగా నిలిచిన పంపిణీ
- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- బాలికల స్పోర్ట్స్ స్కూల్ ప్రతిపాదనలకే పరిమితం



ఆటలు ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. కానీ ఆయా పాఠశాలల్లో వారికి సరిపడా క్రీడా పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 54 ఆశ్రమ పాఠశాలలు ఉండగా వీటిలో 21 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 7,250 మంది బాలికలు ఉన్నారు. 33 బాలుర ఆశ్రమ పాఠశాలలు ఉండగా 8,156 మంది బాలురు ఉన్నారు. అయితే జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో క్రీడా మైదానాలు ఉన్నప్పటికీ వాటికి సంబంధించి ఖోఖో పోల్స్, వాలీబాల్ పోల్స్, నెట్, బ్యాట్మింట్స్, తదితర క్రీడా పరికరాలు లేక విద్యార్థులు క్రీడలకు దూరమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

నిలిచిపోయిన పంపిణీ

జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటూ వివిధ క్రీడల్లో మండల స్థాయి నుంచి జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. పాఠశాలలో వారికి క్రీడా పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా విద్యార్థులు క్రీడలకు దూరం కావద్దనే ఉద్దేశంతో కొంతమంది పీఈటీలు విద్యార్థులనే పోల్స్‌గా చివరిలో నిలబెట్టి ఖోఖో వంటి క్రీడలు ఆడిస్తున్నారు. గత మూడేళ్లుగా జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలకు క్రీడా పరికరాల సరఫరా నిలిచిపోయింది. ఆశ్రమ పాఠశాలలకు సరిపడా క్రీడా పరికరాలు పంపిణీ చేసి విద్యార్థులు మరింతగా క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

జిల్లాలోని వివిధ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. అయితే క్రీడా పాఠశాల ఏర్పాటుకు ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో అనువైనం స్థలాన్ని గుర్తించారు. దీంతో అక్కడ బాలిక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇప్పటికీ ఆ ప్రతిపాదనలకు ఎలాంటి అతిగతీ లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

మరింత రాణించే అవకాశం

జిల్లాలోని వివిధ బాలికల ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొంటూ వివిధ క్రీడల్లో రాణిస్తున్నారు. మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలికల స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేస్తే మరింత మంది బాలికలు క్రీడల్లో వివిధ స్థాయిల్లో రాణించే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి క్రీడా పాఠశాల ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

బస్టాండ్‌లో ప్రయాణికుల సందడి



కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్టాండ్

ఆదిలాబాద్: రాఖీ పండుగ పురస్కరించుకొని ఆదివారం ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సందడి కనిపించింది. సోమవారం సోదరులకు రాఖీలు కట్టేందుకు యువతులు, మహిళలు పెద్దఎత్తున ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించారు. ఆర్టీసీ బస్సులు సైతం ప్రయాణికులతో నిండి రద్దీగా మారాయి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

తుడుందెబ్బ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

ఇంద్రవెల్లి: తుడుందెబ్బ నూతన మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో మండల గౌరవ అధ్యక్షుడిగా జుగ్నాక్ భరత్, మండల అధ్యక్షుడిగా పుర్క చిత్రు, ఉపాధ్యక్షుడిగా సోయం వినోద్‌కుమార్, కార్యదర్శిగా సోయం మురహరి, కోశాధికారిగా జైరాం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మెస్రం భారత్, ఉపాధ్యక్షులుగా చిక్రం రాము, దుర్వ జుగాదిరావు, సభ్యులుగా మెస్రం భీంరావు, కుంరం భీంరావు, ఆత్రం హనుమంత్‌రావు, జుగ్నాక్ జాలింషావ్, ముఖడే ఉత్తం, చహకటి మానిక్‌రావులను ఎన్నుకున్నారు. తుడుందెబ్బ జిల్లా నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు కనక తుకారం, కొట్నాక బారిక్‌రావు, సోయం రాందాష్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కల్లెపెల్లి గంగయ్య

ఇచ్చోడ: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు ప్రతీ నెల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీఈవో కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్రకమిటీ సభ్యులు కుంటాల రాములు, మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దమ్మ, లక్ష్మి, నర్సమ్మ, ఆశమ్మ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంకు సన్మానం

ఇచ్చోడ: మండలంలోని కేశవపట్నం గ్రామంలో 16 సంవత్సరాలు ఏఎన్‌ఎంగా పని చేసి ఇటీవల సిరికొండ ఆరోగ్య ఉపకేంద్రానికి బదిలీపై వెళ్లిన జారుబాయిని ఆదివారం కేశవపట్నం గ్రామస్తులు, ఆశ వర్కర్లు శాలువాతో సన్మానించారు. కరోనా సమయంలో కూడా జారుబాయి గర్భిణీలు, బాలింతలకు సేవలు అందించారని గుర్తు చేశారు.

ఘనంగా సర్దార్ పాపన్నగౌడ్ జయంతి



నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు

ఆదిలాబాద్‌రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతిని ఆదివారం జిల్లా కేంద్రంలో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో పాపన్న గౌడ్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డీఎస్పీ ఆధ్వర్యంలో..

బహుజన సింహం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కలల రాజ్యాన్ని సాధిద్దామని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్, గణేశ్, శేఖర్, రమేశ్, రాంచందర్, నరేశ్, ఒమన్న, నవీన్ కుమార్, రాజు, గంగన్న తదితరులు ఉన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

పాపన్న గౌడ్ తెలంగాణలో గోల్కొండను ఏలిన బహుజన వీరుడని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకిషన్ గౌడ్ అన్నారు. ఆదివారం పాపన్న గౌడ్ జయంతి జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఘనంగా జరుపుకున్నారు. సంఘం జిల్లా జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీకగా నిలిచారని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్, నాయకులు సంతోష్, ఎంఏ షకీల్, కృష్ణారెడ్డి, దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్, మహమ్మద్ రఫీక్ పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి

తలమడుగు: ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఈనెల చివరికల్లా రుణమాఫీ వర్తిస్తుందని కాంగ్రెస్ మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దేవపూర్ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గోక గణేశ్ రెడ్డి, ఎంపీపీ కళ్యాణ లక్ష్మిరాజేశ్వర్, వెంకన్న యాదవ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా గణేశ్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. రెడ్డి సంఘం సభ్యులు రమేశ్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, గ్రామస్తులు తిరుపతి, వెంకన్న, నర్సింహులు, లచ్చన్న, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: అర్హులైన రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ అందిస్తామని పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు.

ట్రస్టు సేవలు అభినందనీయం

బోథ్: వినాయక రావు ట్రస్ట్ సేవలు అభినందనీయమని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ట్రస్ట్ తరఫున ఏడుగురు విద్యార్థులు కలిపి రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి శ్యామ్ మోహన్ రావు, బోథ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రావు దేశ్ పాండే, న్యాయవాదులు మోహన్ రావు, పంద్రం శంకర్, ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్ పాల్గొన్నారు.

గంజాయి రహిత సమాజమే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా అందరూ కృషి చేయాలని ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ చర్యల్లో భాగంగా ఆదివారం మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గంజాయి సాగు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన శిక్షలు పడుతాయన్నారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు పడుతున్నాయని, సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బక సునీల్, పోలీసు కానిస్టేబుళ్లు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బజార్‌హత్నూర్: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల లోపు పంట రుణాలు మాఫీ చేసిన సందర్భంగా ఆదివారం మండలంలోని టెంబి, బజార్‌హత్నూర్ గ్రామాల్లో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మర్రి దేవన్న, అని ల్, పాండురంగ్, నరేశ్, మల్లయ్య, విఠల్, శంకర్, రవీందర్, నర్సయ్య, భీంరావు, దశరథ్, లక్ష్మణ్, సాయి, కిషన్ పాల్గొన్నారు.

'డబుల్‌రోడ్డు పనులు ప్రారంభిస్తాం'



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం నుంచి చింతగూడ గ్రామం వరకు రూ. 8కోట్ల నిధులతో డబుల్‌రోడ్డు మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఆదివారం ఉదయం మండలంలోని లక్కారం, వేణునగర్ కాలనీలలో బొజ్జన్న అడుగు (మార్నింగ్ వాక్) కార్యక్రమం నిర్వహించారు. కాలనీల్లో తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. సుద్దగూడ నుంచి కల్లూరుగూడ వరకు ఇప్పటికే బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. చెరువులను శుద్ధి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. నాయకులు మండల అధ్యక్షుడు ఖయ్యూం, చంద్రయ్య, ఎక్బాల్, కలీం, రాజేశ్, తిరుపతి, గంగరాజుల్ తదితరులు ఉన్నారు.

రుణమాఫీ చేయాలని రైతుల ఆందోళన



పిప్పల్‌కోటిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు



బజార్‌హత్నూర్: సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర చేస్తున్న రైతులు



తలమడుగు: సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర చేస్తున్న రైతులు

తాంసి: పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో రైతులు రోడ్డుపై నిరసన తెలిపారు. గ్రామశివారులోని రోడ్డుపై బైఠాయించి ప్రతీ కుటుంబానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గంటకు పైగా నిరసన తెలిపి సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులు షేక్ అఫ్రోజ్, వెంకటేశ్, స్వామి, రాజన్న, దత్తు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర

బజార్‌హత్నూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతీ రైతు కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలో రుణమాఫీ కాని రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో వీధుల గుండా శవయాత్ర చేపట్టారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రైతులు అల్కే గణేశ్, చట్ల వినీల్, రమణ, ప్రశాంత్, భోజన్న, శ్రీనివాస్, విఠల్, చంద్రశేఖర్, గంగారెడ్డి, నారాయణ, సాయన్న, విలాస్, నర్సయ్య, రాములు, వినోద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం

తలమడుగు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి అందరికి రుణమాఫీ అందించడం లేదని ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరింత ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. రైతులు ప్రవీణ్, సుదర్శన్‌రెడ్డి, ధనుంజయ్, నరసింహులు, భూమన్న, అశోక్, గంగాధర్, పురుషోత్తమ్, గణపతి, సతీశ్, ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆందోళన



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో బీజేపీ నాయకులు రైతులతో కలిసి ఆదివారం ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. నాయకులు దత్తానిక్కమ్, ఇంద్రశేఖర్, తాక్రే సందీప్, రామెల్లి మోరేశ్వర్, రాకేష్ పోత్రాజ్ నవీన్, సలాం దేవరావు పాల్గొన్నారు

బీఆర్ఎస్ నాయకుల ధర్నా

మండలంలోని సిర్సన్న గ్రామంలో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం అర్హులందరికి రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని సముదాయించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రమోద్ రెడ్డి, దీపక్ గౌడ్, సురేశ్, సతీశ్ పవర్, జక్కుల మధుకర్, విపిన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి..

ఎదులాపురం: సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ చేసేంత వరకు కాంగ్రెస్ నాయకులను ప్రజలు, రైతులు నిలదీయాలని బీఆర్ఎస్ రైతు జిల్లా సమన్వయ అధ్యక్షుడు రోకండ్ల రమేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డుపైనే ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు ఆదివారం మరమ్మతులకు గురై రోడ్డుపైనే నిలిచిపోయింది. ఆదిలాబాద్ నుంచి కరంజి(టి) వైపు ఉదయం ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అంతర్రాష్ట్ర రోడ్డుపై ఏర్పడిన గుంతల కారణంగా బస్సు టైర్‌పై ఉన్న ఇనుపపట్టీలు విరిగిపోయాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును వెంటనే నిలిపివేశాడు. రోడ్డుపైనే బస్సు నిలిపివేయడంతో ఇతర ఆర్టీసీ బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మధ్యాహ్నం అనంతరం ఆర్టీసీ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేసి బస్సును ఆదిలాబాద్‌కు తరలించారు.

పాదపూజలో ఎమ్మెల్యే



నేరడిగొండ: మండల కేంద్రానికి చెందిన ఆడేపు రమేశ్ మాతృమూర్తి ఇటీవలే మృతిచెందారు. ఆదివారం స్థానిక శబరిమాతా ఆశ్రమంలో నిర్వహించిన పాదపూజ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆడేపు లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ వర్ధంతి

ఉట్నూర్‌రూరల్: బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ 79వ వర్ధంతి ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సమరయోధుడు , యువతరంలో స్వాతంత్ర్య కాంక్షను రేకెత్తించిన నిత్యా స్ఫూర్తి ప్రదాత , సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లయేలను హడలెత్తించిన వీరుడు సుభాశ్‌చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో మహమ్మద్ ముజీబ్ , దూట మహేందర్, సిడాం సోనేరావు, భూమన్న, ప్రభాకార్, అర్జున్న తదితరులున్నారు.

'భారత్‌బంద్' విజయవంతం చేయాలి

ఎదులాపురం: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను నిరసిస్తూ ఈనెల 21వ తేదీన ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు భీంరావు వాగ్మారే పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నాయకులు దాదాసాహెబ్, రంగరావు, ఉద్ధవ్, కల్యాణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి బాధిత కుటుంబాలను ఎంపీ నగేశ్ ఆదివారం పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎంపీకి సన్మానం

మండలంలోని పద్మశాలీ సంఘం సభ్యులు ఆదివారం ఆదిలాబాద్ ఎంపీ నగేశ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. పద్మశాలీ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

మండల కార్యవర్గం ఎన్నిక

సిరికొండ: తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. మండలాధ్యక్షుడిగా మాడవి మాణిక్‌రావు, ఉపాధ్యక్షుడిగా కుమ్ర భూదేవి, ప్రధాన కార్యదర్శిగా పుష్పలత, సహాయ కార్యదర్శిగా సునీతలను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం రాజు ఉన్నారు.







రాఖీ సందడి



సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. సోమవారం రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లాకేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా మండలాల్లో మహిళలు, యువతులు రాఖీ కొనుగోళ్లు చేస్తూ సందడి చేశారు. వివిధ డిజైన్లలో, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రాఖీలను అమ్మకం దారులు మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు.

– ఆదిలాబాద్/ ఇచ్చోడ

పంటచేలో సరదాగా డీసీసీబీ చైర్మన్



పత్తిపంట పరిశీలిస్తున్న భోజారెడ్డి

తాంసి: నిత్యం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజాప్రతినిధులు, నాయకులు బిజీగా గడుపుతుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి నిత్యం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ వ్యవసాయ పనులను సైతం పర్యవేక్షిస్తుంటారు. ఈక్రమంలో ఆదివారం తన సొంత గ్రామం భీంపూర్ మండలం వడూర్‌లో ఉన్న వ్యవసాయ చేనులో పనులను పర్యవేక్షించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899